క్లుప్తంగా

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

కిర్లంపూడి: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, దానికి అనువైన పంటలు వేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ జోకా అమృత సూచించారు. గురువారం నుంచి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ జియో కో ఆర్డినేటర్, క్యూఆర్‌కోడ్ ద్వారా భూసార పరీక్షలు కోసం మట్టి నమూనాలను సేకరిస్తారన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి గల రైతులు స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

డాక్టర్ అన్వేషికి సత్కారం



డాక్టర్ అన్వేషిని సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

తుని రూరల్: వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న తుని మండలం తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అన్వేషిని రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం కాకినాడ జిల్లా కేంద్రం రెడ్‌క్రాస్ బ్రాంచి కార్యాలయంలో జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ ప్రసాదరాజు, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ అన్వేషిని సత్కరించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు వై.రామారావు, డీపీఎం ఆదిలింగం పాల్గొన్నారు.

లోవ ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం



లోవ ఘాట్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈఓ విశ్వనాథరాజు

తుని రూరల్: మరమ్మతులకు గురైన లోవ దేవస్థానం ఘాట్‌రోడ్డుకు బీటీ లేయర్ వేసే పనులకు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు బుధవారం శ్రీకారం చుట్టారు. రూ.21 లక్షలతో 610 మీటర్ల ఘాట్ రోడ్డుకు మరమ్మతు పనుల్లో భాగంగా ఒక లేయరు బీటీ వేస్తున్నారు. రెండు రోజుల్లో పనులు చేసి ఘాట్ రోడ్‌ను సిద్ధం చేస్తామని ఈఓ తెలిపారు. ఆషాఢమాసంలో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారులను ఆధునీకరిస్తున్నట్టు చెప్పారు.

రేపు నూతన పీహెచ్‌సీ ప్రారంభం

గండేపల్లి: గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) శుక్రవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, కాకినాడ ఎంపీ వంగా గీత ప్రారంభిస్తారని ఎంపీపీ చలగళ్ల దొరబాబు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అధ్యక్షతన ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభోత్సవంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



ఎగిసిపడుతున్న మంటలు

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లి ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన గోనిపాటి చిట్టిబాబు ఇంటికి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఆ పంటలు పక్కనే ఉన్న సిద్దాబత్తుల అప్పారావు ఇంటికి సైతం అంటుకున్నాయి. స్థానికులు, జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు ఇంటి నిర్మాణం కోసం దాచిన సుమారు రూ.3 లక్షల నగదు, రెండు కాసులన్నర బంగారం, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. కూతురు వివాహం కోసం అప్పారావు దాచిన రూ.3 లక్షలు, ఆరు కాసుల బంగారు వస్తువులు, నిత్యావసరాలు కాలిపోవడంతో రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

భూముల రీసర్వే ప్రారంభం

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో చేస్తున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాల్లో భూముల రీసర్వేను బుధవారం ప్రారంభించారు. వీఆర్వో వాడపల్లి ప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

కర్షకా.. సాగుకు దిగులు లేదిక

- జోరుగా పుష్కర కాలువ అభివృద్ధి పనులు
- మంత్రి రాజా సొంత నిధులతో పూడిక తీత
- పది వేల ఎకరాలకు అందనున్న సాగునీరు

తుని రూరల్: మండలంలోని పుష్కర కాలువలో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతుండడం, తొలకరి వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో పుష్కర కాలువలో పూడిక, తుప్పలు తొలగించి కాలువను సిద్ధం చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలన్న లక్ష్యంతో తుని నియోజకవర్గ ఎమ్మెల్యే, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా నాలుగేళ్లుగా తన సొంత నిధులు రూ.7 నుంచి రూ.8 లక్షలు ఖర్చు చేసి కాలువను శుభ్రం చేయిస్తున్నారు. దీంతో ఖరీఫ్‌కు అవసరమైన సాగునీరు పంటపొలాలకు పుష్కలంగా చేరుతుంది. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది తుని మండలం తేటగుంట శివారు గవరపేట నుంచి ఎస్.అన్నవరం శివారు కోమటి చెరువు వరకు పూడికతీత పనులు చేపట్టారు. పూడిక తీత పనులు వారం రోజుల్లో పూర్తికానున్నాయి. పూడికతీతతో తుని, తొండంగి, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలాల్లో ఖరీఫ్‌లో పదివేల ఎకరాలకు సాగునీరు పూర్తిస్థాయిలో చేరనుంది.



పుష్కర కాలువలో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న దృశ్యం

మంత్రి రాజా సహకారంతో..

పుష్కర కాలువలో పూడిక తీయడం రైతులకు పెనుభారంగా మారింది. పూడిక తొలగింపునకు అధికారులు సకాలంలో చర్యలు చేపట్టికపోవడంతో రైతులకు సాగునీరు అందడంలో తీవ్ర జాప్యం కలుగుతోంది. 2020లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను తెలుసుకున్న మంత్రి దాడిశెట్టి రాజా తన సొంత నిధులతో కాలువను శుభ్రం చేయించారు. దాంతో పంటపొలాలకు పుష్కలంగా గోదావరి జలాలు చేరాయి. అదేవిధంగా 2021, 2022లోనూ పూడిక తొలగింపునకు మంత్రి సహకరించారు. ప్రస్తుతం నాలుగో సంవత్సరం రైతులకు సాగునీరు సకాలంలో చేర్చేందుకు పూడిక తీత పనులను చేయిస్తున్నారు. దీంతో తుని మండలం గవరపేట, టి.వెంకటాపురం, టి.తిమ్మాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, జిల్లేడుపాడు, వల్లూరు, ఎ.అగ్రహారం, చామవరం, ఎస్.అన్నవరం, కవలపాడు, తొండంగి మండలం పైడికొండ, ఆనూరు, కృష్ణాపురం, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్తేరు, తదితర గ్రామాల పరిధిలో రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆయా గ్రామాల్లో చెరువులకు పుష్కర జలాలు మళ్లించి, చెరువుల నుంచి పంట కాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేర్చుతున్నారు. ఇలా ఈ గ్రామాల పరిధిలో పదివేల ఎకరాలకుపైగా సాగు నీరు అందుతుంది.

పుష్కలంగా సాగునీరు



పది ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. నాలుగేళ్లుగా పుష్కర కాలువ నుంచి గోదావరి జలాలు చెరువులకు, అక్కడ నుంచి పంట పొలాలకు చేరుతున్నాయి. 2020 సంవత్సరానికి ముందు వర్షాధారంపై ఆధారపడి సాగు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం పూడిక తీసేందుకు అయ్యే ఖర్చు మాపై పడడం లేదు.

– ములికి పెద్దిరాజు, కౌలుదారుడు, హెచ్.కొత్తూరు

సకాలంలో ఖరీఫ్ సాగు



రైతుల సౌకర్యార్థం నాలుగేళ్లుగా పుష్కర కాలువలో పూడికలు తీస్తున్నారు. ఇందుకు అయ్యే వ్యయాన్ని మంత్రి దాడిశెట్టి రాజా భరిస్తున్నారు. పనులు జరుగుతుండగానే పంపా రిజర్వాయర్ నుంచి నీరు విడుదలు చేస్తుండడంతో చెరువులకు మళ్లిస్తున్నాం. తొలకరి వర్షాలు కురిస్తే రైతులు సకాలంలో ఖరీఫ్ పనులు చేసుకోవచ్చు.

– పోల్నాటి ప్రసాద్, ఏఎంసీ మాజీ డైరెక్టర్, టి.తిమ్మాపురం

జోరుగా పంట, ఆస్తి నష్టం అంచనా



తేటగుంటలో ధ్వంసమైన అరటి, కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు

తుని రూరల్: మండలం తేటగుంటలో అకాల వర్షాలు, ఈదురు గాలులకు దెబ్బతిన్న ఇళ్లు, పండ్లతోటల నష్టాలను అధికారుల అంచనా వేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు, భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. పలు ఇళ్ల ధ్వంసం కాగా అరటి, కొబ్బరి, మామిడి, జీడి మామిడి తోటలు, రహదారుల వెంట భారీవృక్షాలు కుప్పకూలిపోయాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నష్టాలను పరిశీలించారు. బాధితుల వివరాలను సేకరిస్తున్నారు. ఏడీఏ సుంకర బుల్లిబాబు ఆధ్వర్యంలో బృందం పండ్లతోటల అంచనాలను రూపొందిస్తున్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి టీవీవీ సత్యనారాయణ ఆయా ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు సహాయ సహకారాలు అందించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- జగన్నాథపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం

కోటనందూరు: వివక్షతకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధిని వివరించారు. జగన్ పాలన ఎలా ఉందని, ఇంకా ఏమైనా చేయాలా అని ప్రశ్నించారు. గ్రామస్తులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటిని తక్షణమే పరిష్కరించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.



జగన్నాథపురంలో వృద్ధుడికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

వారసుడిని పరిచయం చేసిన మంత్రి

మంత్రి తనయుడు శంకర్ మల్లిక్ రాజకీయ అరంగేట్రం చేశారు. బుధవారం తూర్పు సెంటుమెంటుగా మండలంలోని జగన్నాథపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు మంత్రి తన తనయుడిని పరిచయం చేశారు. తొలుత గ్రామానికి అశేష జనసందోహం నడుమ తరలివచ్చిన మంత్రిరాజా, అతని తనయుడు శంకర్ మల్లిక్‌లకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు స్వగృహంలో ఈఓ పెన్మత్స విశ్వనాథరాజు ఆధ్వర్యంలో లోవ దేవస్థానం పండితులు ఆశీర్వచనాలు అందించారు. గ్రామంలోని ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ తన కుమారుడు శంకర మల్లిక్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉత్సాహ పడుతున్నాడని, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా అండగా ఉండి ముందుకు నడిపించాలని కోరారు. శంకర్‌మల్లిక్ మాట్లాడుతూ ఇంతటి జనసందోహం నడుమ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు పరిచయం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇక మీదట మీలో ఒకడిగా, వైఎస్సార్ సీపీ కార్యకర్తగా తన తండ్రి దాడిశెట్టి రాజా సూచించిన మార్గంలో నడుస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, లోవదేస్థానం మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, కుంచే అచ్చిరాజు, బొత్స సత్తిబాబు, దొడ్డి బాబ్జి, తుమ్మల నాగేశ్వరరావు, రుత్తల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌మల్లిక్‌ను వైఎస్సార్ సీపీ శ్రేణులకు పరిచయం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

పేదల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, సొసైటీ చైర్మన్ చెక్కపల్లి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి, జువ్వల బాబులు, నానిపల్లి చంటి తదితరులతో కలిసి సచివాలయం-3 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, గ్రామ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాస్, పార్టీ నాయకులు జువ్వల చినబాబు, బొల్లు తాతాజీ, కుప్పిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గోకవరం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎ.జయానంద్, వై.మహేష్ ప్రయాణిస్తున్న బైక్, కామరాజుపేటకు చెందిన ఎం.వాసు ప్రయాణిస్తున్న బైక్ బుధవారం కొత్తపల్లి శివారున ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానికులు గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి, ఎంఈవో టి.జోసెఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్ఎస్ రామ్‌కుమార్, సంఘన వెంకటేశ్వరరావు, శరకణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

రౌతులపూడి: జగనన్న విద్యా కానుక కిట్ల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాజవరం ఎంపీటీసీ సభ్యుడు సోమరౌతు సీతారామస్వామి కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రాఘవులు ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు కిట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం కన్వీనర్ సోమరౌతు భాస్కర్, సచివాలయ కన్వీనర్ పంచాడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కోటనందూరు: వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని జగన్నాథపురంలో గతంలో తుని నియోజకవర్గానికి బీజేపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వెలగా ఈశ్వరరావుతో పాటు మరో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి దాడిశెట్టి రాజా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వెలగా ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఊపిరిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితమై వైఎస్సార్ సీపీలో చేరినట్టు తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి దాడిశెట్టి రాజా

గ్రామ వలంటీర్ మృతి



లోవరాజు (ఫైల్)

అన్నవరం: స్థానిక నాలుగో వార్డు వలంటీర్ కక్కల లోవరాజు (30) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా లోవరాజు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తీవ్ర గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతడిని కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లోవరాజుకు ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి సత్యవతి దేవస్థానంలోని ప్రైవేట్ శానిటరీ ఏజెన్సీలో పనిచేస్తున్నారు. లోవరాజు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ హరి

ప్రత్తిపాడు: రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టేలా వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీఏ) డీఆర్సీ హరి సూచించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సామల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయన్నారు. చిరుధాన్యాల సాగులో మెళకువలను వివరించారు. జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీ యింటి వీర గంగాధర్, ఏడీఏ మాధవి, ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడు బాబ్జీని సత్కరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: సీఆర్పీగా విధులు నిర్వహిస్తూ 98 డీఎస్సీ ఉపాధ్యాయుడిగా విధులోకి చేరిన పసగడుగుల బాబ్జీని బుధవారం సత్కరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్లు బాబ్జీని శాలువా, పూలమాలతో సత్కరించారు. విధి నిర్వహణలో బాబ్జీ సేవలు అభినందనీయమని ఎంఈఓ కొనియాడారు. పాతికేళ్ల క్రితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాలన్న కల ఎట్టకేలకు సాకారం కావడంతో విద్యార్థులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ శేఖర్, కంప్యూటర్ సహాయకుడు శంపెంగ మణేష్, అకౌంటెంట్ లోవరాజు, సిబ్బంది గోవిందు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

తొండంగి: ఈ ఏడాది టెన్త్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహం అందించిందని ఎంఈవో షేక్‌బాబ్జీ బుధవారం తెలిపారు. మండలంలోని అద్దరిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చవాకుల కల్యాణి టెన్త్ పరీక్షల్లో 578 మార్కులతో జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికై oదన్నారు. ఆమెను గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అభినందిస్తారని చెప్పారు.

ఘనంగా ప్రపంచ రక్తదాన దినోత్సవం

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణానికి చెందిన సుమారు 21 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు చిన్నారావు, సౌజన్య, మధు, సేవాసమితి సభ్యులు పిచ్చెట్టి కృష్ణ, రాముశ్రీను, బసా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

84 యూనిట్ల రక్తం సేకరణ

కోటనందూరు: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తుని ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్‌తో పాటు మరొక 84 మంది రక్తం దానం చేశారు. వీరిలో 30 మంది 25 పర్యాయాలకు పైగా రక్తదానం చేసిన వారున్నారు. వీరందరినీ మంత్రి దాడిశెట్టి రాజా శాలువాలతో సత్కరించి అభినందించారు. మరొకరి ప్రాణాన్ని నిలబెట్టే రక్తదానానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తుని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, పోతుల లక్ష్మణ్, వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో రక్తదానం చేస్తున్న యువకులు

'ఫ్యామిలీ డాక్టర్'తో పేదలకు మెరుగైన వైద్య సేవలు

గండేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రమేష్ అన్నారు. మండలంలోని ఎస్టీ రాజాపురంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. గ్రామాల్లోని పనిచేస్తున్న వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గండేపల్లిలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట పెద్దాపురం డివిజన్ డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.సరిత, వైద్యులు సౌమ్య, నరేష్, సీహెచ్‌ఓ శర్మ, పీహెచ్‌ఎన్ రూతమ్మ, హెచ్‌వీ హెలినా, హెచ్‌ఎస్ చెల్లారావు తదితరులు ఉన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి రమేష్

ఇంటర్‌లో శ్రీదుర్గాహాసినికి మూడో ర్యాంకు



కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి గ్రామానికి చెందిన గోపు వీరశ్రీనివాస్, జ్యోతి దంపతుల కుమార్తె శ్రీదుర్గాహాసిని ఇంటర్మీడియెట్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 470కి 464 మార్కులు సాధించి స్టేట్‌లో మూడో ర్యాంక్ సాధించింది. జగపతినగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న శ్రీదుర్గా హాసిని గత నెలలో ఇంటర్ పరీక్షలు రాసింది. స్టేట్ మూడో స్థానం సాధించిన శ్రీదుర్గాహాసినిని కళాశాల యాజమాన్యం, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై రామకృష్ణ మూర్తి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట మండలం నరేంద్రపట్నం గ్రామానికి చెందిన చిత్తరపు వెంకటేశ్వర్లు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ సంస్థలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఏలేశ్వరం మండలం తిరుమాలిలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లాల్సి ఉండగా రాజమహేంద్రవరం నుంచి మంగళవారం టీవీఎస్ ఎక్సెల్ బండిపై బయలు దేరాడు. సోమవరం గ్రామానికి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలపాలయ్యాడు. హైవే సిబ్బంది అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడి కొడుకు చిత్తరపు హేమాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రామకృష్ణమూర్తి తెలిపారు.

నేడు ఈ-ఆటో రిక్షాల ప్రారంభం

తుని: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తుని పురపాలక సంఘానికి మంజూరు చేసిన ఈ-ఆటో రిక్షాలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం ప్రారంభిస్తారని కమిషనర్ ప్రసాదరాజు బుధవారం తెలిపారు.